క్లుప్తంగా

ప్రతి రికార్డు పక్కాగా ఉండాలి

• ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్ పట్నాయక్



గర్భాం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్‌పట్నాయక్

మెరకముడిదాం: సచివాలయానికి సంబంధించిన ప్రతి రికార్డు పక్కా సమాచారంతో అప్‌డేట్‌గా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్ పట్నాయక్ సూచించారు. మండలంలోని గర్భాం మేజర్ పంచాయతీ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులు పరిశీలించారు. ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. పారిశుద్ధ్యపనులు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు.

ఈఓపీఆర్‌డీకి ఉద్యోగోన్నతి



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన సురేష్

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న ఇప్పలవలస సురేష్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఇంతవరకు చీపురుపల్లి ఎంపీడీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు వహిస్తున్న ఆయన మంగళవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు మండల పరిషత్ సిబ్బందితోపాటు ఉపాధిహామీ, వెలుగు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన



కొండలక్ష్మీపురం పరిసరాలను పరిశీలిస్తున్న డీడీఓ

చీపురుపల్లిరూరల్(గరివిడి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోనికి తీసుకురావాలని డివిజనల్ అభివృద్ధి అధికారి హేమసుందరరావు అన్నారు. గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తీరును మెరుగుపరచాలని ఈఓపీఆర్‌డీ పుష్పాంజలికి సూచించారు.


ఆయుర్వేదంతో ఆరోగ్యం పదిలం



అవగాహన కల్పిస్తున్న ఆయుర్వేద వైద్యురాలు సునీత

బొండపల్లి: ఆయుర్వేద వైద్య విధానం పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని గొట్లాం ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి బి.సునీత అన్నారు. ఈనెల 23న జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆరోగ్యం కోసం చిన్న అడుగు' పేరిట గొట్లాం హైస్కూలులో విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు.రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు.హెచ్‌ఎం శ్రీరామాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోసంరక్షణపై విజ్ఞాన పరీక్ష



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గోసంరక్షణపై గోసంరక్షణ సమితి విభాగ ప్రచారక్ రమేష్,తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ బంకుర గోవిందనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన పరీక్ష నిర్వహించారు. 64 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకాగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు, ఎంఈఓ బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా నగదు బహుమతి అందజేశారు.వీరు త్వరలో నిర్వహించనున్న జిల్లాస్థాయి విజ్ఞాన పరీక్షలకు అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాలల సందర్శన

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఎంఈఓ చలుమూరి కూర్మారావు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, తదితర రికార్డులు, వర్క్ బుక్స్ పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ-2 శ్రీనివాసరావు,ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

పేదల సొంతింటి కలపై నీలినీడలు

• ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
• పేదల కోసం చిల్లపాలెంలో 4.60 ఎకరాలు కేటాయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
• 206 మందికి పట్టాలు ఇచ్చేందుకు అప్పట్లో ఎంపిక
• ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిన పట్టాల పంపిణీ
• కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టించుకోని వైనం




చిల్లపాలెంలో పేదల కోసం గత ప్రభుత్వం కేటాయించిన 4.60 ఎకరాల భూమి

జామి: పేదల సొంతింటి కల సాకారంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పేద వాడికి కూడా ఇంటి పట్టా కానీ, ఇల్లు కానీ మంజూరు చేసిన పాపాన పోలేదు. తాము అధికారంలోకి వస్తే పేదలకు గృహనిర్మాణానికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో అయితే మూడు సెంట్ల స్థలం ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఆర్థిక సహాయం చేస్తామని టీడీపీ కూటమి తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. గత ప్రభుత్వంలో పట్టాలు మంజూరైన వారికి ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే కూటమి అధికారం లోకి వచ్చి 15 నెలలు గడిచిపోతున్నా మండలంలో కనీసం ఒక్క పేద వాడికైనా ఇంటి నిర్మాణం కోసం సెంటు భూమి ఇవ్వలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన భూమిని సైతం పేదలకు ఇచ్చేందుకు ఈ ప్రభుత్వం చొరవ చూపడం లేదు. గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఊరూరా జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటు చేసి పట్టాలు, ఇళ్లు మంజూరు చేసింది. మూడు విడతల్లో స్థలాలు సేకరించింది. మొదటి, రెండో విడతలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, స్థలాలు ఇవ్వడంతో పాటు ఆర్థిక సహాయం అందించడంతో ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఆయా కాలనీల్లో మౌలికవసతులు కల్పించారు. మూడో విడతలో వేసిన లేఅవుట్‌లో ఇళ్ల పట్టాలకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యి, పట్టాలు అందజేసే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కొన్ని చోట్ల పట్టాల పంపిణీ, స్థలాల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయింది.

సిద్ధంగా 4.60 ఎకరాల లేఅవుట్

జామి మండలంలోని భీమసింగి పంచాయతీ చిల్లపాలెం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం మూడో విడతలో భాగంగా సుమారు 4.60 ఎకరాల లేఅవుట్‌ను సిద్ధం చేసింది. ఇక్కడ భీమసింగి పంచాయతీతో పాటు సమీప పంచాయతీలకు చెందిన 206 పేద కుటుంబాలకు స్థలాలు ఇచ్చేందుకు ఎంపిక చేశారు. లేఅవుట్ స్థలం అంతా చదును చేశారు. రెవెన్యూ అధికారులు చేసిన జాప్యం, తదితర కారణాల వల్ల పట్టాల పంపిణీ జరగలేదు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పట్టాల పంపిణీ నిలిచిపోయింది. పేదలకు అందించాల్సిన పట్టాలు రెవెన్యూ అధికారుల వద్దే ఉండిపోయాయి. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టాల పంపిణీ గురించి కనీసం పట్టించు కోలేదు. దీంతో 206 పేద కుటుంబాల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. ఇక్కడి లేఅవుట్ తుప్పలు,డొంకలు పెరిగి నిరుప యోగం గా ఉంది. రెవెన్యూ అధికారులు,పాలకులు స్పందించి తమకు పట్టాలు అందజేసి, స్థలాలు కేటాయించాలని అప్పటిలో ఎంపికైన వారు కోరుతున్నారు.



రెవెన్యూ అధికారులు రూపొందించిన లే అవుట్ ప్లాన్

ఎలాంటి ఆదేశాలు రాలేదు

చిల్లపాలెం లేఅవుట్‌తో పాటు ఎక్కడా ఇళ్ల స్థలాల కేటాయింపు,పట్టాల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు.ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పట్టాల పంపిణీ, స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకుంటాం.

– వి.కృష్ణంరాజు, తహసీల్దార్, జామి మండలం

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు

• వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు 'వలిరెడ్డి'



వలిరెడ్డి శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కక్ష సాధింపు చర్యలు తప్ప సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు లేవని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడుతూ వ్యవస్థలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరిపైనా ఉంటుందని, అలా ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి అవలంబించడం తగదన్నారు. సాధారణంగా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు మాత్రమే కాకుండా సోషల్ మీడియా, పత్రికలపై కూడా కక్ష సాధింపు చేపడుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ కథనాలు రాసినా కక్ష సాధింపు చేపట్టడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో బుద్ధి చెబుతారన్నారు.

డీసీసీబీలో అందరూ భాగస్వామ్యులు కావాలి



ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున

చీపురుపల్లి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అభివృద్ధిలో విద్యార్థులు, యువత, మహిళలు, రైతులు భాగస్వామ్యం అవసరమని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలను డీసీసీబీలో తెరవాలని విజ్ఞప్తిచేశారు. డీసీసీబీ ఓ వైపు రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తూనే మరోవైపు వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 24 డీసీసీబీ బ్యాంకు శాఖలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, డీసీసీబీ సీఈఓ ఉమామహేశ్వరరావు, మేనేజర్ వాసు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చీపురుపల్లి బాలికలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: ఉమ్మడి విజయనగరం జిల్లా స్థాయిలో వేణుగోపాలపురం డైట్ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికలను పాఠశాల హెచ్‌ఎం రెహానా బేగం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. హెచ్‌ఎం రెహానా బేగం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు నిర్వహించిన పోటీల్లో పాఠశాల బాలికలు రాణించడం ఆనందంగా ఉందన్నారు. నృత్య ప్రదర్శన విభాగంలో ఎస్.గీతిక, ఎం.సింధుజ, ఎస్.హారిక, ఎస్.హేమ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పాటల పోటీల విభాగంలో సీహెచ్ లిఖిత, పి.త్రివేణి, సీహెచ్‌విద్యూష, బి.భవానీలు ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు ఎస్.నారాయణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత

• రైతులపై చంద్రబాబుకు ఎందుకీ పగ
• యూరియా కోసం గతంలో ఎప్పుడూ రైతులు ఈస్థాయిలో ఇబ్బందులు పడలేదు
• విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే యూరియా కొరత ఏర్పడిందని, అరకొరగా వస్తున్న యూరియాను కూడా బ్లాక్ మార్కెట్‌కు తరలించేస్తున్నారని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని వైఎస్సా ర్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యూరియా కోసం రైతన్నలు ఈస్థాయిలో రోడ్డెక్కడం తన ముప్పై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదన్నారు. ఒక్క బస్తా యూరియా ఇస్తే చాలని రైతన్నలు రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు పడుతుండడం చేస్తే బాధనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లోనే రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా సరిపడా యూరియా, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు.రైతులంటే సీఎం చంద్రబాబుకు చులకన భావమని, వ్యవసాయం దండగ అనేది ఆయన విధానమని అన్నారు. రైతులపై చంద్రబాబుకు ఎందుకు ఇంత పగ అని ప్రశ్నించారు.నియోజకవర్గ రైతులు ఎరువుల కోసం కష్టాలు పడుతుంటే ఈ నియోజకవర్గానికి చెందిన మంత్రి ఎక్కడా కనిపించడం లేదని, ఈ మంత్రి అన్ని విధాలా విఫలమయ్యారని విమర్శించారు. జెడ్పీటీసీ గార తవుడు మాట్లాడుతూ గజపతినగరం పీఏసీఎస్ వద్ద రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కి నిరసన తెలపడం వెనుక వైఎస్సార్ సీపీ నాయకుల ప్రోద్బలం ఉందనిఏఎంసీ చైర్మన్ గోపాలరాజు అనడం తగదని అన్నారు. రైతుల సమస్యను, వారి ఆవేదనను రాజకీయం చేయవద్దని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ మండల నాయకులు, మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ, కంది తిరుపతినాయుడు, కనకల సుబ్రహ్మణ్యం, కర్రి రామునాయుడు, శీర రమణ తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదాగా సర్వసభ్య సమావేశం

శృంగవరపుకోట: ఎస్.కోట మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. రోడ్డు అభివృద్ధిలో దుకాణాలు కోల్పోయిన వారికి పాతబస్టాండ్‌లో ప్రత్యామ్నాయం చూపించాలని నిర్ణయించారు.జమాఖర్చుల ఆమోదం, కొత్త భవన నిర్మాణాల ఆమోదం, ఇళ్లకు నెంబర్లు వేయడం, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టనున్న పనులపై చర్చించారు. పారిశుద్ధ్య కార్మికులకు అయిదు నెలలుగా వేతనాలు బకాయి ఉందని, మూడు నెలల వేతనాలైనా ఇమ్మంటే రెండు నెలలకే ఇస్తున్నారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఈఓ అనూరాధ ప్రస్తుతం నిధుల కొరత ఉందని, ఇంటి పన్ను వసూళ్లు పూర్తికాగానే మరొక నెల వేతనం ఇస్తామని వివరణ ఇచ్చారు. స్థానిక శివప్రియ హోటల్ నుంచి షిర్డీసాయిబాబా ఆలయం వరకు రోడ్డుపై ఆక్రమణలు తొలగించి వెడల్పు చేసేందుకుఅనుమతించాలని రెవెన్యూ వర్గాలు కోరాయని ఈఓ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపసర్పంచ్ మోపాడ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై విచారణ

దత్తిరాజేరు: కొద్ది నెలల క్రితం ఎస్.బూర్జవలస రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 69లో ఉన్న కారి చెరువు గట్టుపై చెట్లను కొంత మంది నరికివేశారని అదే గ్రామానికి చెందిన బోని తిరుపతి లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీఓ కిరణ్‌కుమార్, ఈఓపీఆర్డీ వాణిశ్రీ, మండల సర్వేయర్ అప్పలస్వామి మంగళవారం విచారణ జరిపారు. చెరువుగట్టుపై చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఫిర్యాదుదారుడు, చెట్ల నరికారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో మాట్లాడడంతో పాటు గ్రామ పెద్దల అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించిన అనంతరం వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.

నేడు మండల సర్వసభ్యసమావేశం

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ శాఖ ఉద్యోగుల నిరసన

జామి: తమ సమస్యలు పరిష్కరించకపోతే దశల వారీగా ఆందోళనలు చేపడతామని విద్యుత్‌శాఖ ఉద్యోగులు తెలిపారు. రెండో రోజు జామి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు భరించాలన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు.

అరకొర బస్సులతో అవస్థలు



ఆర్టీసీ బస్సులు తగిన సంఖ్యలో లేకపోవడంతో గజపతినగరం మండల ప్రజలురాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం అందుకుతగ్గట్టుకు బస్సులను కేటాయించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్సుల్లో మహిళల రద్దీపెరగడం, ఎక్కడికక్కడ నిలిపివేస్తుండడంతో బస్సులు సమయానికి గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రావడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. గజపతినగరం నుంచి విప్పలవలస, జక్కువ, కొండలింగాలవలస తదితర గ్రామాలకు వెళ్లే పల్లె బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. బస్సులు ఎక్కేందుకు తోపులాటలు జరుగుతుండడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– గజపతినగరం

'మా భూములు మాకిచ్చేయండి'



సుమారు 80 రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆందోళనలు చేస్తున్న జిందాల్ భూనిర్వాసితులు తమ స్వరం మార్చారు. ప్రస్తుతం వారంతా 'మీ డబ్బులు మీకిచ్చేస్తాం.. మా భూములు మాకిచ్చేయండి'' అంటూ నినదిస్తున్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామ్‌సుందర్‌రెడ్డికి సోమవారం తమగోడు చెప్పుకున్న నిర్వాసితులు బొడ్డవరలో మంగళవారం యథావిధిగా తమ ఆందోళన కొనసాగించారు.

– శృంగవరపుకోట

ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరం



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు కుమార్

చీపురుపల్లి: ప్రాథమిక చికిత్సపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఏరియా ఆస్పత్రి వైద్యుడు కుమార్ చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో మంగళవారం రెడ్‌క్రాస్ యూత్ సభ్యులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో రోగికి అందించే ప్రాథమిక చికిత్స ప్రాణాలను కాపాడుతుందన్నారు. పాముకాటు, కుక్క కాటు, పక్షవాతం, విద్యుత్ షాక్ తదితర అత్యవసర సమయాల్లో అందించాల్సిన ప్రథమ చికిత్సపై రెడ్‌క్రాస్ యూత్ సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ డివిజన్ కోఆర్డినేటర్ బి.వి.గోవిందరాజులు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి బి.విజయేశ్వరరావు, అధ్యాపకులు ఎ.చంద్రమౌళి, కె.జ్వాలాముఖి, తదితరులు పాల్గొన్నారు.

రణభేరీని జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

జామి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజారావు కోరారు. సంబంధిత వాల్‌పోస్టర్లను స్థానిక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు మంగళవారం ఆవిష్కరించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు.బోధనేతర పనులు రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చెయ్యాలని, డీఏలు చెల్లించాలని, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రణభేరిపేరిట ఉత్తరాంధ్రలో జరుగుతున్న బైక్ జాతాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు.యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వాసుదేవరావు,జిల్లా కార్యవర్గసభ్యులు ఆళ్ల రాము,తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే ఎందుకు అంత చిన్న చూపు..?



మాట్లాడుతున్న రాములు,పైడిపునాయుడు

బొండపల్లి: రైతులంటే కూటమి ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్నచూపు అని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాకోటి రాములు,టి.పైడిపునాయుడు ప్రశ్నించారు. మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎరువుల కొరత లేదని పాలకులు పదే పదే చెబుతూ నెపం అధికారులపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రిగా ఉన్న కొండపల్లి శ్రీనివాస్ తన నియోజకవర్గంలో రైతులు యూరియా కోసం రోడ్డెక్కితే ఆయనకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం యూరియా వాడని రైతులకు బస్తాకు రూ.800 ఇస్తామని ప్రకటించడం చుస్తూంటే ఈ ప్రభుత్వం ఎరువులు పంపిణీ చేయలేదని అర్థమవుతోందన్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందించకపోతే వారి తరఫున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో ఘనంగా వారాల పండగ



బొండపల్లి: నెలివాడలో పూజలందుకుంటున్న బిత్రమ్మతల్లి

బొండపల్లి: మండలంలోని నెలివాడ,అంబటివలస, దేవుపల్లి, కొవ్వాడపేట,గొల్లుపాలెం,గిట్టుపల్లి గ్రామాల్లో గ్రామదేవతల వారాల పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఆయా గ్రామస్తులు ఘటాలు,ప్రభలతో అమ్మవారి ఆలయాలకు తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వేపాడలో..

వేపాడ: వేపాడ- వీలుపర్తిలో గ్రామదేవతల వారాల పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు.ఏటా వరినాట్లు పూర్తికాగానే వారాల పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం ఉదయం వీలుపర్తి పైడితల్లమ్మకు ,సాయంత్రం వేపాడ పరదేశమ్మ అమ్మవార్లకు పసుపు, కుంకమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఓజోన్ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



శృంగవరపుకోట: డిగ్రీ కళాశాలలో వ్యాసరచన పోటీల విజేతకు బహుమతులిస్తున్న అధ్యాపకులు

శృంగవరపుకోట: ఓజోన్ పొరను కాపాడుకోవడం మానవాళి సమష్టి బాధ్యత అని ఉపాధ్యాయులు అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో మంగళవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు ఓజోన్ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచనపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

• కొట్టాం ఉన్నత పాఠశాలలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని హెచ్‌ఎం పి.వి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఓజోన్ పొరను రక్షించాలి అంటూ విద్యార్థులు గొడుగులు వేసుకుని గ్రామంలో ర్యాలీ చేశారు. వెంకటరమణపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ-3 అక్షర క్రమంలో మానవహారం ఏర్పాటు చేశారు.

సోంపురంలో..

వేపాడ: సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం వానపల్లి జగన్నాథం ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు ఓ-3 అక్షరం ఆకారంలో కూర్చొని ప్రదర్శన ఇచ్చారు.